క్లుప్తంగా

ఉద్యోగ నియామకాలు



ఎంపికైన విద్యార్థులు

సుజాతనగర్: సుజాతనగర్ మండలంలోని ధన్వంతరీ ఫార్మసీ కళాశాలలో దివిస్ ఫార్మా కంపెనీ హైదరాబాద్ వారు జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కళాశాలతో పాటు చుట్టుపక్కల కాలేజీల్లోని బీఫార్మసీ, ఎంఫార్మసీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు సోమవారం జాబ్ మేళా నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు నియామకపత్రాలు అందజేశారు. కళాశాల చైర్మన్ తారాకుల భాస్కర్, ప్రిన్సిపాల్ నాగరాజు, ఎ.ప్రకాష్‌రెడ్డి, విజయ్‌కుమార్, రామ్మోహన్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులకు అభినందనలు

కొత్తగూడెంరూరల్: తెలంగాణ గురుకులంలో ఎంట్రెన్స్ రాసి సీట్లు సాధించిన లక్ష్మీదేవిపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను సోమవారం హెచ్‌ఎం ఎం.జ్యోతిరాణి అభినందించారు. హంసిని, రిత్విక్, అభిరామ్‌లకు బొకే ఇచ్చి, ఉన్నత చదువులు చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు సురేందర్, శ్రీలత, కల్యాణి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

త్రివేణి పాఠశాలలో...

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని త్రివేణి పాఠశాల విద్యార్థులను తెలంగాణ బాలోత్సవ్ కన్వీనర్ ఆచార్య మద్దెల శివకుమార్ సోమవారం అభినందించారు. బాలోత్సవ్‌లో నృత్య ప్రదర్శన, వ్యాసరచన, కవితా రచన, యోగాసనాలలో బహుమతులు సాధించిన విద్యార్థులను కలిసి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌సింగ్ మాట్లాడుతూ... విద్యార్థులలోని ప్రతిభాపాటవాలను బయటకు తీయటానికి బాలోత్సవం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అకడమిక్ ఇన్‌చార్జ్‌లు వరప్రసాద్, ఫాతిమా తదితరులు ఉన్నారు.

సాయి ఎక్స్‌లెంట్ స్కూల్‌లో...

జూలూరుపాడు: గురుకులం ప్రవేశ పరీక్షలో జూలూరుపాడు సాయి ఎక్స్‌లెంట్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఫిబ్రవరి 11న జరిగిన 5వ తరగతి ఎంట్రెన్స్ టెస్ట్‌లో 50 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. సోమవారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంఈఓ డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరరావు సీట్లు సాధించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కరస్పాండెంట్ కృష్ణప్రసాద్, ప్రిన్స్‌పాల్ సీహెచ్ శారద, డైరెక్టర్లు హుస్సేన్, శివకుమారి, నరసింహారావు, భద్రం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామ్యాతండా ప్రభుత్వ పాఠశాలలో...

టేకులపల్లి: టేకులపల్లి మండలం కుంటల్ల పంచాయతీ సామ్యాతండా ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు గురుకులం ఐదో తరగతి ప్రవేశ పరీక్షలో రాణించారు. ఈ మేరకు సోమవారం హెచ్‌ఎం పూల్సింగ్ వివరాలు తెలిపారు. ఇటీవల జరిగిన గురుకులం ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు ఈ పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయగా ఐదుగురు బానోతు అనూష, బాదావత్ కీర్తన, ఇస్లావత్ గీత, భూక్యా మనోహర్, భూక్యా కుష్వంత్ సీట్లు సాధించినట్లు చెప్పారు.

15 ఏళ్లుగా తెరుచుకోని తలుపులు

- నిరుపయోగంగా కమ్యూనిటీ మల్టీ యుటిలిటీ సెంటర్ భవనం
- పట్టణ నడిబొడ్డున పక్కా నిర్మాణం
- పట్టని పాలకులు – ప్రయోజనం శూన్యం



ప్రారంభానికి నోచుకోని కమ్యూనిటీ మల్టీ యుటిలిటీ సెంటర్

ఇల్లెందు: ఇల్లెందు పట్టణం నడిబొడ్డున ప్రభుత్వ నిధులతో ఓ పక్కా భవనం నిర్మించి 15 ఏళ్ల గడిచింది. అయితే అది లక్ష్యం నెరవేరకపోగా ఇతర అవసరాలకు కూడా ఉపయోగించుకోకుండా నిరుపయోగంగా మారింది. 2007–08లో ఇల్లెందు మున్సిపల్ అభివృద్ధి కోసం'సమీకృత మురికి వాడల గృహాల అభివృద్ధి పథకం (ఐహెచ్ఎస్‌డీపీ) రూ.34.12 లక్షలు వెచ్చించి నిర్మించిన కమ్యూనిటీ మల్టీ యుటిలిటీ సెంటర్ భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఈభవనంలో ఒక హాల్, అధికారులకు విశ్రాంతికి, టీ, టిఫిన్, భోజనం చేసేందుకు వేర్వేరు గదులు, గ్రంథాలయం, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లను పట్టణంలోని డ్వాక్రా సభ్యులకు ఇవ్వాల్సి ఉంది. అయితే ఈ పథకం రద్దు కావటం, నిధులు మురిగిపోయాయి. భవనం నిర్మించిన కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు కూడా చెల్లించలేదు. దీనివల్ల ఆ కాంట్రాక్టర్ భవనాన్ని మున్సిపాలిటీకి అప్పగించలేదు. నాటి నుంచి నేటి వరకు ఈ భవనం నిరుపయోగంగానే ఉంది.

ఐహెచ్ఎస్‌డీపీతో సాగిన పనులు...

2007–08లో ఆనాటి కేంద్ర ప్రభుత్వ ఐహెచ్ఎస్‌డీపీ పథకం ద్వారా మున్సిపాలిటీలకు నిధులు కేటాయించింది. ఇల్లెందు మున్సిపాలిటీకి రూ.2.85 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఇందులో ఏడు పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. ఈ నిధులలో రూ.2.08 కోట్లు ఖర్చు చేశారు. పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు చేపట్టారు. మరో రూ.93.31 లక్షలతో మరో ఐదు పనులు చేపట్టాల్సి ఉండగా అందులో లైవ్‌హుడ్ సెంటర్స్, కూరగాయల మార్కెట్, రిక్షా షెడ్స్, టాయిలెట్స్, మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభించకుండానే వదిలేశారు. పట్టణంలోని హమాలీ బస్తీ, స్టేషన్ బస్తీ, సంజీవయ్య కాలనీ, ఇందిరనగర్ కాలనీ, సివిల్‌లైన్ ఏరియా, హరిజనవాడ, సబ్‌జైల్ బస్తీ, 14 నంబర్ బస్తీ, కొత్తబస్టాండ్ ఏరియా, కాకతీయనగర్, పాతఇల్లెందులపాడు, నంబర్ 2 బస్తీ, నంబర్ 14 బస్తీ, ఆంబజార్, బాటన్‌పిట్ ఏరియా, ఎన్జీఓఎస్ కాలనీ, మంగళివాడలో రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణం పనులు చేపట్టారు. జగదాంబ సెంటర్‌లో మహిళలు తయారు చేసిన వస్తువులు విక్రయించుకునేందుకు ఏర్పాటు చేయాల్సిన లైవ్లీవుడ్ సెంటర్ నిర్మాణానికి రూ.19.14 లక్షలు, కూరగాయల అభివృద్ధి కోసం రూ.19.44 లక్షలు, పాతబస్టాండ్ సెంటర్‌లో రిక్షా ద్వారా జీవనోపాధి పొందుతున్న రిక్షా కార్మికుల షెడ్ నిర్మాణానికి రూ.3.63 లక్షలు, కమ్యూనిటీ మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం రూ.8.84 లక్షలతో చేపట్టాల్సి ఉన్నా వదిలేశారు. ఇలా ఐహెచ్ఎస్‌డీపీ పథకం దుర్వినియోగంగా మారింది. సకాలంలో పనులు పూర్తి చేయకపోవడంతో నిధులు మురిగిపోయాయి. ఇక రూ.34.12 లక్షల నిధులతో నిర్మాణం పూర్తి చేసిన కమ్యూనిటీ హాల్ నిరుపయోగంగా మారింది.

ఉపయోగంలోకి తీసుకరావాలి..



పట్టణ నడిబొడ్డున నిర్మాణం పూర్తయిన కమ్యూనిటీ హాల్ 15 ఏళ్లకు పైగా నిరుపయోగంగా ఉన్నా.. మున్సిపాలిటీ పాలకవర్గం పట్టించుకోకుండా కాలం గడపడం తగదు. భవనాలు ఉన్నా కొత్త భవనాలు నిర్మించటం వల్ల ఎలాంటి ఉపయోగం లేదు. తక్షణం అందుబాటులోకి తీసుకు రావాలి

– నాయిని సైదులు, ఇల్లెందు

పాలకవర్గం చొరవ చూపాలి..



మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం సమీపిస్తున్నా ఐదేళ్ల కాలంలో రూ.34.12 లక్షలు వెచ్చించిన పక్కా భవనం సద్వినియోగం చేసుకోలేదు. పాలకవర్గం చొరవ తీసుకోకపోవడం వలన ఈ తప్పిదం జరిగింది. ఇప్పటికైనా నిరుపయోగంగా మారిన భవనాన్ని ఉపయోగంలోకి తీసుకరావాలి.

– యాకుబ్‌షావలీ, ఇల్లెందు

ఓటు ప్రాధాన్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం

కొత్తగూడెంఅర్బన్: ఓటు హక్కును ప్రతీఒక్కరు వినియోగించుకోవాలని, ఓటు తెలివైన ఆయుధమని రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ ప్రభుదయాళ్ తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు, సిబ్బందికి ఓటు ప్రాధాన్యతపై సోమవారం పాఠశాలలో అవగాహన కల్పించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం అయిన మనదేశంలో ఓటు చాలా విలువైనది, అది ఓటర్లకు ఇవ్వబడిన ఆయుధం... కావున అందరూ ఓటు ప్రాముఖ్యతను తెలుసుకుంటూ, ఇతరులకు వివరించాలన్నారు. 18 సంవత్సరాలు పైబడిన ఓటు హక్కు ఉన్న బంధువులు, పెద్దలు, తల్లిదండ్రులు అందరికీ ఓటు పవిత్రతను తెలియజేస్తూ అందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్య పర్చాలని విద్యార్థులను కోరారు.

కోడ్ ఉల్లంఘనపై చర్యలు తీసుకోండి..



సూపర్‌బజార్(కొత్తగూడెం): సీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ) వికాస్‌రాజ్‌కు ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ సోమవారం వినతిపత్రం అందజేశారు. జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో ఈనెల 15న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జేవీఎల్ శిరీష ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ నాయకుడు గొంగ్లి సంజీవరెడ్డి ఫొటోతో ఉన్న 3194 యూనియన్ జిల్లా డైరీని ఆవిష్కరించారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని వెంటనే ఎన్నికల అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇర్పా ప్రకాష్, భూక్యా కుమార్ నాయక్, అరుణ్ పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన డీఎంహెచ్‌ఓ జేవీఎల్ శిరీష, డీసీహెచ్ఎస్ రవిబాబలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అధికారులను ప్రశ్నించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంధం మల్లికార్జునరావు, సాయి, అల్లకొండ శరత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని కొత్తగూడెం, సత్తుపల్లి ఓసీల ప్రభావిత ప్రాంత నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఏరియాలోని సింగరేణి కుటుంబాల, మాజీ సింగరేణి ప్రాజెక్ట్ ప్రభావిత పునరావాస పరిసర గ్రామాల నిరుద్యోగ యువతకు సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులపై నిర్వహించే ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ రీజినల్ డైరెక్టర్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్ పెన్యూనరీ షిప్ సహకారంతో మొత్తం 38 వృత్తి కోర్సులల్లో శిక్షణ ఉంటుందని, ఇందులో కాస్మోరాలజీ (మహిళలకు) డ్రోన్ టెక్నీషియన్, సోలార్ టెక్నీషియన్, సెల్ టెక్నీషియన్, టూ వీలర్ మెకానిక్, ఆర్క్‌గ్యాస్ వెల్డింగ్, కంప్యూటర్ డీటీపీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ కోర్సులకు దరఖాస్తులు చేసుకోవచ్చని వివరించారు. డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, 10వ తరగతి పాస్ అయి ఉండాలని, ఒక్కో బ్యాచ్‌కు 20 మందికి శిక్షణ ఇవ్వబడుతుందని, ఆసక్తి గల ఏరియాలో 18 నుంచి 42 సంవత్సరాల వయస్సున్న యువతీ, యువకులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ఇఇజె వెబ్‌సైట్ తీతీతీ. ఛిఛి ఝజీ.ఛిట.భీౌఝ/ఞ ఇఱఞ్చిఞ్ఛజీఛిౌటజీజీ ఇఞ్చైట్‌సైట్‌లో ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకొని ప్రింట్ కాపీ, సర్టిఫికెట్స్, కొత్తగూడెం ఏరియా ఎంవీటీసీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఎటువంటి జీత భత్యాలు ఇవ్వబడవని తెలిపారు.

ఉపాధి హామీ పథకం నిర్వీర్యం



మాట్లాడుతున్న గౌని నాగేశ్వరరావు

పాల్వంచరూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలను పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకుడు గౌని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రెడ్డిగూడెంలో సోమవారం ఐఎఫ్‌టీయూ, అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఉపాధి హామీ పథకాన్ని కేంద్రప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, బడ్జెట్‌లో నిధులను తగ్గిస్తూ పథకాన్ని ఎత్తివేసేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే నేషనల్ మొబైల్ మానిటరింగ్ సర్వీసింగ్‌ను తీసుకొచ్చి మొబైల్ యాప్‌ని ప్రవేశపెట్టిందన్నారు. ఏజెన్సీలో ఇంటర్‌నెట్ సమస్యలతో హాజరు నమోదు కాకపోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందన్నారు. గతంలో మేట్లు ఉంటే ఇప్పుడు వారిని తగ్గిస్తూ సెల్‌ఫోన్‌తో నడిపిస్తున్నారని చెప్పారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు లేక పెరుగుతున్న ఉష్ణోగ్రతతో అనేక మంది ఎండలో పనిచేస్తూ వడదెబ్బలకు గురవుతున్నట్లు చెప్పారు. ప్రథమ చికిత్స అందించే పరిస్థితిల్లో కూడా ఈ పాలకులు లేరన్నారు. బడ్జెట్‌లో ఉపాధి పథకానికి నిధులు పెంచాలని, కొలతలతో సంబంధం లేకుండా రూ.750 చెల్లించాలని, ప్రతీఒక్కరికి జాబ్‌కార్డులు ఇవ్వాలని, రైతుల వ్యవసాయ భూముల్లో పనులు కల్పించాలని, తట్టలు, పారలు, టెంట్లు, మజ్జిగ, తాగునీరు ప్రభుత్వం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వీరమల్ల మల్లయ్య, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఉమ, మేట్లు రామ్మూర్తి, జైపాల్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, యాస సతీష్‌రెడ్డి, లింగయ్య, ఏలేందర్ పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

ఇల్లెందు: పీఎం జీవనజ్యోతి బీమా యోజన పథకం కింద అకాల మరణం చెందిన ఓ వ్యక్తి కటుంబానికి బీమా చెక్కు అందజేశారు. పట్టణంలోని నంబర్–2 బస్తీకి చెందిన లోథ్ అనిల్ 2023లో సోషల్ సెక్యూరిటీ స్కీం ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకంలో చేరి, బీమా చెల్లింపు కింద రూ.430 చెల్లించాడు. అకాల మృతి చెందాడు. సోమవారం ఇల్లెందు ఎస్‌బీఐలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేనేజర్ పీసీ ప్రధాన్ మృతుడి కుటుంబానికి రూ.2 లక్షలు చెక్కు అందజేశారు.

దెబ్బతిన్న ఇళ్ల పరిశీలన



ఇళ్లను పరిశీలిస్తున్న చంద్రశేఖర్‌రావు

చుంచుపల్లి: ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో ఆదివారం కురిసిన అకాల వర్షం కారణంగా చుంచుపల్లి మండలం ప్రశాంతినగర్ గ్రామపంచాయతీలో దెబ్బతిన్న ఇళ్లను సోమవారం జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు పరిశీలించారు. నష్టపోయిన కుటుంబాలకు ధైర్యం చెప్పి విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

నష్ట నివారణ చర్యలు చేపట్టండి..



జిల్లా అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సింగరేణి(కొత్తగూడెం): యుద్ధ ప్రాతిపదికన అకాలవర్షం నష్ట నివారణ చర్యలు చేపట్టాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కలెక్టర్‌ను కోరారు. ఆదివారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా కురిసిన వడగండ్లవాన, భారీ ఈదురుగాలులతో తీవ్రంగా నష్టం జరిగిందని తక్షణమే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి యుద్ధ ప్రాతిపదినక నష్ట నివారణ చర్యలు చేపట్టాలని ఆయన సోమవారం కలెక్టర్, విద్యుత్‌శాఖ జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. వడగండ్ల వాన, ఈదురు గాలులతో పేదల ఇళ్లు, గుడిసెలు నేలమట్టం అయ్యాయని, విద్యుత్ స్తంభాలు నేలకొరిగి అనేక గ్రామాలు, పట్టణాల్లోని బస్తీలు అంధకారంలో ఉన్నట్లు చెప్పారు. తక్షణమే విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టాలని కోరారు. ఇల్లు కోల్పోయిన పేదలకు తక్షణమే పరిహారం అందజేసే విధంగా చర్యలు చేపట్టాలని, ఇల్లు పూర్తిగా కోల్పోయిన వారికి గృహపథకం మంజురు చేయాలని పేర్కొన్నారు. మామిడి, మిర్చి ఇతర పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్ట పోయారని సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులతో సర్వే చేపట్టి నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు.

డాక్టర్ వీవీ.రావు సేవలు మరువలేనివి



వీవీ.రావుకు నివాళి అర్పిస్తున్న వైద్యులు

టేకులపల్లి: వైద్యశాఖలో డాక్టర్ వీసం వెంకటేశ్వరరావు (వీవీ రావు) అందించిన సేవలు మరువలేనివని వక్తలు పేర్కొన్నారు. ఈ మేరకు వీవీరావు స్వగ్రామం టేకులపల్లి మండలం మేళ్లమడుగు గ్రామంలో సోమవారం సంస్మరణ సభ నిర్వహించారు. సభకు హాజరైన వక్తలు, ప్రముఖులు వీవీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. వీవీ రావు సివిల్ సర్జన్, పిల్లల వైద్య నిపుణులుగా 30 సంవత్సరాల పాటు సేవలు అందించారని కొనియాడారు. మారుమూల గ్రామం నుంచి ఎంబీబీఎస్, డీసీహెచ్ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జెడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి, నర్సంపేట మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలం భిక్షపతిరావు, ప్రముఖ మహబూబాబాద్ అనస్తీషియా చింత రమేష్, ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాస్‌రావు, అడిషనల్ డీఎంహెచ్‌ఓ కురం సింగరాజు, అడిషనల్ డీఎంహెచ్‌ఓ ములుగు గొంది సత్యనారాయణ, అడ్వకేట్ అరెం పాపారావు, డాక్టర్ పుల్లయ్య, ప్రొఫెసర్ ఈసం నారాయణ, చీమల పొట్టయ్య వీసం నీలమయ్య, శ్రీనివాస్ ప్రసాద్, కారపట్టి వీరస్వామి, గోగల పాపయ్య, కొమరం క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ(ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవం



ఇల్లెందు: మాట్లాడుతున్న గుమ్మడి నర్సయ్య



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న సీతారామయ్య



జూలూరుపాడు: గుండ్లరేవులో జెండా ఆవిష్కరణ

ఇల్లెందు: దోపిడీ, పీడనలు లేని సమాజం కోసం ఏర్పడిన సీపీఐ(ఎం–ఎల్) ఆవిర్భవించి 57 ఏళ్లు నిండిందని, ఈ కాలంలో ఎంతోమంది ప్రజల రాజ్యం కోసం పోరాడి అశువులు బాసారని ఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, రాష్ట్ర నాయకులు చంద్ర అరుణ అన్నారు. సోమవారం ఎల్లన్న విజ్ఞాన కేంద్రంలో జరిగిన లెనిన్ 153 జయంతి సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడారు. లెనిన్ ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు పార్టీ జెండా ఎగురవేశారు. యాకుబ్‌షావలీ, పృథ్వీ, వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు, శ్రీరాములు, శేషయ్య, మల్లేష్, వీరన్న, సందీప్, రవి, బాలు పాల్గొన్నారు.

ఎన్డీ ఆధ్వర్యంలో...

పట్టణంలోని ఎన్డీ కార్యాలయంలో జరిగిన లెనిన్ జయంతి సందర్భంగా జెండా ఎగుర వేసి, లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆవునూరి మధు, తుపాకుల నాగేశ్వరరావు, కొక్కు నాగేశ్వరరావు, చిన్నస్వామి, శ్రీను, కల్తీ కోటమ్మ, సుభద్ర, మంగ, లత, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: సీపీఐ(ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవాన్ని, లెనిన్ జయంతిని న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వంచారు. కొల్లాపురం గ్రామంలో ఎర్రజెండాను పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు జె.సీతారామయ్య మాట్లాడుతూ.. భూమి, భుక్తి, పీడిత ప్రజల విముక్తి కోసం దోపిడీ లేని రాజ్యస్థాపనకై రష్యాలో లెనిన్ నేతృత్వంలో కామ్రేడ్లు చక్రవర్తులను మట్టి కరిపించి కార్మిక రాజ్యాన్ని స్థాపించారని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తితో దోపిడీ, రాచరిక వ్యవస్థలపై ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో రాసుద్దీన్, మోకాళ్ల సుగుణ, చీమల మల్లమ్మ, విజయ, మల్లేష్, విగ్నేష్, అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: సీపీఐ(ఎంఎల్) ఆవిర్భావ వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సోమవారం టేకులపల్లి మండలం బద్దుతండాలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో భూక్యా హర్ష్య జెండా ఎగురవేశారు. మాట్లాడుతూ.. మార్క్సిస్టు సిద్ధాంతవేత్తల్లో ఒకరుగా మారిన లెనిన్ ప్రపంచ దేశాలకు విప్లవాన్ని సాధించే మార్గాన్ని చూయించాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామ, లక్ష్మణ్, బాలు పాల్గొన్నారు.

శ్రామిక రాజ్యస్థాపన కోసం పోరాడుదాం...

జూలూరుపాడు: శ్రామిక రాజ్యస్థాపన కోసం పోరాడుదామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం గుండ్లరేవు గ్రామంలో క్రామేడ్ లెనిన్ 154వ జయంతి, సీపీఐ(ఎంఎల్) 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ సీనియర్ నాయకులు మల్కం వెంకటేశ్వర్లు పార్టీ జెండా ఆవిష్కరించారు. కృష్ణ మాట్లాడుతూ... చరిత్ర గతిని మార్చి, శ్రమజీవుల రాజ్యం, సోషలిజం స్థాపనకై కృషి చేసిన లెనిన్ పోరాట స్ఫూర్తితో కార్మికవర్గం, అణగారిన వర్గాల ప్రజలు పోరాటాల్లో ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో బానోత్ ధర్మా, ఏదులాపురం గోపాల్‌రావు, మల్కం వెంకటేశ్వర్లు, నరసింహారావు, తాటి రోహిణి, పాపారావు, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

చేతికొచ్చిన పంట.. నేలపాలు

- అకాలవర్షంతో తీవ్రంగా నష్టపోయిన రైతులు
- గాలిదుమారంతో లేచిపోయిన ఇళ్ల పైకప్పులు
- పంట నష్టాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, అధికారులు



ఇల్లెందురూరల్: తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న వికలాంగ రైతు రామారావు



కొత్తగూడెంఅర్బన్: చెట్ల తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్

ఇల్లెందురూరల్: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షం రైతులను కోలుకోకుండా చేసింది. సక్రమంగా నీరందక వానాకాలంలో దిగుబడి లేక తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలు యాసంగిలోనైనా ఆ నష్టాన్ని పూడ్చుకుందామని ఆశగా సాగు చేశారు. సాగునీటి కష్టాలను అధిగమిస్తూ పంట చేతికందే సమయంలో చేనులోనే తడిసి ముద్ద కావడంతో రోదిస్తున్నారు. ఉమ్మడి చల్లసముద్రం, రాఘబోయినగూడెం గ్రామపంచాయతీలలో అత్యధిక విస్తీర్ణంలో రైతులు పంటలను నష్టపోయారు. రాఘబోయినగూడెం గ్రామపంచాయతీలో వికలాండుగైన బియ్యాని రామారావు తనకున్న రెండు ఎకరాలలో వరిసాగు చేసి కోత కోసి కుప్పనూర్చి విక్రయించేందుకు ఆరబెట్టుకున్న సమయంలో వచ్చిన అకాల వర్షం పంటను పూర్తిగా తడిపి ముద్ద చేసింది. తడిసిన పంటను చూసి ఆ రైతు కన్నీరుమున్నీరయ్యాడు. నెహ్రూనగర్, ఆంజనేయపురం గ్రామాలకు చెందిన రైతుల పంటలు నేలవాలడంతో తీవ్రంగా నష్టపోయారు. ఇంతేకాకుండా నెహ్రూనగర్ గ్రామంలో ఐదు ఇళ్ల పైకప్పులు పూర్తిగా లేచిపోయాయి. కోళ్లఫారం పైకప్పు కూడా గాలిలో తేలియాడటంతో రైతు తీవ్రంగా నష్టపోయాడు.

పంట నష్టాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే...

మండలంలోని ఉమ్మడి చల్లసముద్రం, రాఘబోయినగూడెం గ్రామపంచాయతీలలో అకాల వర్షానికి జరిగిన పంట నష్టాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం పరిశీలించారు. పలు గ్రామాలలో నేల వాలిన మొక్కజొన్న, వరి పంటలను చూసి రైతులకు, ధైర్యం చెప్పారు. నష్టపోయిన ప్రతీరైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, నష్టాన్ని అధికారుల వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు.

పరిశీలించిన వ్యవసాయ అధికారులు...

మండలంలోని పలు గ్రామాలలో పంట నష్టాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు సోమవారం పర్యటించారు. ఏఓ సతీష్, సిబ్బందితో కలిసి నేలవాలిన మొక్కజొన్న, వరి పంటలను, వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానంగా ఉమ్మడి చల్లసముద్రం, రాఘబోయినగూడెం గ్రామపంచాయతీలలో తీవ్రంగా నష్టం వాటిల్లినట్లు అంచనా వేశామన్నారు.

నేలకొరిగిన చెట్లు.. విరిగిపోయిన స్తంభాలు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో ఆదివారం సాయంత్రం అకాలవర్షం, భారీగా గాలులకు పట్టణంలోని హెడ్డాఫీసు సెంటర్, రామవరం, రాజీవ్ గృహకల్ప, పోస్టాఫీసు సెంటర్లలో భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో సోమవారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాలేదు. రాత్రంతా ప్రజలు అంధకారంలో, ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. పలుచోట్ల ఇళ్ల పైకప్పులు కొట్టుకపోయాయి. చిరు వ్యాపారుల దుకాణాలు నేలమట్టం అయ్యాయి. మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి ఆదేశాల మేరకు నేలకొరిగిన చెట్లను తొలగించారు. ఇంకా పనులు కొనసాగుతున్నాయి.





ఇల్లెందురూరల్: నేలవాలిన వరిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, ఆంజనేయపురంలో పడిపోయిన మొక్కజొన్న, నెహ్రూనగర్‌లో లేచిపోయిన ఇంటి పైకప్పు